# 17. సగటు బుద్ధి

బంధు, మిత్ర, పరిచయాల్లో ఏదో ఒకటి లేకుండా పత్రికల్లో కథలు పడటం కష్టమనే విషయం తెలియక, ఎన్ని కథలు తిరిగొస్తున్నా విసుగుచెందకుండా మళ్ళీ పత్రికలకు కథలు పంపే తిరుగుటపా రచయితలా మరోసారి ప్రయత్నిద్దామని చెట్టుదగ్గరి కెళ్ళాడు వామన్ - చెట్టెక్కి శవాన్ని భుజంపై వేసుకొని చెట్టుదిగి శ్మశానం దిక్కు నడుస్తున్నాడు— అతన్ని మాట్లాడించాలని శవంలోని భేతాళుడు—

"ఓ మనిషీ? నిన్ను చూస్తుంటే నువ్వీ దేశంలోని సగటు మనిషివని అర్థమవుతుంది - సగటు మనుషులేం కోరుకుంటారో నాకు తెలియంది కాకున్నా నీ ప్రయత్నమెందుకో చెబితే సంతోషిస్తాను—" అన్నాడు -

"ఔను— నేనీదేశంలోని సగటు మనిషిని — ఆ మనిషికుండే లక్షణాలన్ని నాకున్నాయి— దుఃఖంవస్తే ఏడుస్తాను స్వల్పలాభం కలిగినా ఎగిరి గంతేస్తాను— నమ్మినవాళ్ళు నమ్మకద్రోహం చేస్తే బాధపడతాను నాతో సాయంపొందిన వాళ్ళే నన్నపార్థం చేసుకుంటే ఆవేదన చెందుతాను — విద్యార్థిగా ఉన్నప్పుడు తెల్లవార్లు కూర్చుని నోట్సు తయారు చేసేవాన్ని — మిత్రులకిచ్చేవాన్ని -- నేమ చదువులో చురుకు కాబట్టి నేను సాయంచేసినా వాళ్ళకు నాపై మంటగానే వుండేది— ఉద్యోగమొచ్చింతర్వాత నాకు చేతనైన సహాయం చేశానితర్లకు— కాని నిర్మొహమాటంగానే మాట్లాడే నా తత్వం నాకు శత్రువులను పెంచింది— బంధువులంతా నావాళ్ళే అనుకున్నాను— కాని అవసరానికెవరూ పనికిరారని

ఋజువైంది—నాతో సాయంపొందిన అక్కలు, చెల్లెండ్లే నష్టంచేయాలని చూస్తున్నారు—భార్య, అమ్మనాన్నల మధ్య విభేదాల్ని సరిచేయడానికి ప్రయత్నించి ఇద్దరికి దూరమయ్యాను—నేను జీవితంలో ఓడిపోయాను—ఘోరంగా ఓడిపోయాను—నాకు మనశ్శాంతికావాలి—అందుకే నేనీ ప్రయత్నం చేస్తున్నాను—.

తనలో తాను గొణుక్కొని నడుస్తున్నాడు వామన్—

"మానవా! నువ్వెందుకీ ప్రయత్నం చేస్తున్నావో చెప్పకున్నా ఫర్వాలేదు—బట్టలుతికేవాడు ఉఫ్ఉఫ్ అనేకూతతో, పడవ నడిపేవాడు హైలెస్సా హైలెస్సా పాటలతో, బరువులెత్తేవాడు జోర్ చెయ్ బార్ చెయ్ నాదంతో పనిభారాన్ని మరచిపోతారు—అలాగే నీకూ బరువు తెలియకుండా ఉండడానికో కథ చెబుతాను—విను—" అని చెప్పసాగాడు భేతాళుడు—

కపాలేశ్వర్‌రావు మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు-తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తే బుద్ధిగా చదువుకొని డిగ్రీ పాసయ్యాడు-కాంపిటెటివ్ పరీక్షలురాసి మంచి ఉద్యోగంలోనే చేరాడు—అప్పుడాతని చుట్టు బంధుజనాలు ఈగల్లా ముసరసాగారు-ఎక్కడెక్కడివో బంధుత్వాలు చెప్పుకొని సాయం పొందడానికి ప్రయత్నించసాగారు—మిత్రులూ అతన్ని ఇంద్రుడు, చంద్రుడనీ పొగిడి పనులు తీసుకోసాగారు—అతడు తనకు సాధ్యమైనంత సాయం చేసాడితరులకు—ఆర్థిక సాయమూ చేశాడు-బంధువులకు తినడానికి, తాగడానికి ఖర్చుపెట్టి మంచివాడనిపించుకున్నాడు-ఇంటి భవిష్యత్తు చూడమని భార్య చెప్పినా వినిపించుకోలేదు—

అక్కా చెల్లెండ్లకు, బావలకు, వాళ్ల పిల్లలకు ప్రతి పండక్కీ, ఫంక్షనుకి బట్టలు, కానుకలు దండిగా ముట్టజెప్పాడు-తన పిల్లలగూర్చి

సంసారంగూర్చి ఏమాత్రం ఆలోచించలేదు. తనకు చాలామంది మిత్రు లున్నారని సగర్వంగా చెప్పుకునేవాడు—అయితే కాలగమనంలో ఎన్నో మార్పులు సహజం. కొంతకాలం తర్వాత అతని ఆర్థిక పరిస్థితి చితికి ఇతర్ల సాయంపొందే స్థితికొచ్చాడు—ఉద్యోగంలోనూ ఆవకతవకలు—అతని ఈ పరిస్థితి చూచి మిత్రులు, బంధువులంతా కనబడకుండా పోయారు—సాయం చేయమని నోరుతెరచి అడిగినా సాయం చెయ్యక పోగా "ముందుచూపుండాలి" అని చివాట్లుపెట్టి పంపించారు — అందరి తోనూ కాదనిపించుకున్నాడు — అతని పరిస్థితికి సానుభూతి చూపడానికి బదులు స్వయంకృతమని చెప్పిన బుద్ధిమంతులూ వున్నారు—

అప్పుడుగాని కనువిప్పు కాలేదతనికి- తనెక్కడున్నాడో తెలుసు కున్నాడు—అయినా తన పరిస్థితికి ఇతర్ల ప్రవర్తనకు ఆవేదన చెందాడు. ఎన్నో గుణపాఠాలు నేర్చుకున్నాడు—కష్టపడి, నానా తంటాలు పడి తన పరిస్థితిని చక్కదిద్దుకున్నాడు ఇప్పుడాతని ప్రవర్తన మునుప టిలాలేదు—ఇప్పుడాతను తనగూర్చి, తన సంసారం గూర్చి మాత్రమే ఆలోచిస్తున్నాడు—

కథ చెప్పడం ఆపి వామన్‌తో భేతాళుడు

ఆపదలోవున్న కపాలేశ్వరరావును బంధు మిత్రులెదుంకు ఆదు కోలేదు —? ఈ కథవల్ల నేర్చుకోవాల్సిన నీతి ఏంటి? ఈ ప్రశ్నలకు జవాబులు తెలిసీ చెప్పకపోయావో నిన్ను నీ పిల్లలకు కూడా దూరమ య్యేలా శపిస్తాను..." అన్నాడు....

"పొగడ్తలకో, మాటలకో ఉబ్బిపోయి కీర్తికాంక్షలతోనో, మంచి వాడనిపించుకోవాలనో వెనుకాముందాలోచించకుండా ప్రవర్తించడం మధ్యతరగతి బుద్ధి—చేసిన సాయానికి మళ్ళీ సాయంపొందాలనుకోవడం

తనలాగే ఇతర్లుంటారనుకోవడం సగటుబుద్ధి — తాను సాయంచేసాడు కాబట్టి తనకు ఆపదలో ఇతర్లు సాయంచేస్తారని భావించాడు సగటుమనిషి కపాలేశ్వర్‌రావు-కాని స్వార్థపూరితమైన ఈలోకంలో నూతిలోపడ్డవాని మీద నూరు రాళ్ళేసేవారే కాని పైకిలాగే వారుండటం తక్కువ—అట్లని కపాలేశ్వర్‌రావుకు జరిగినట్టే అందరికీ జరుగుతుందనుకోవడమూ పొరపాటే-ఈ విషయం తెలుసుకోక కపాలేశ్వర్‌రావు వాళ్ళ ప్రవర్తనచూచి ఆవేదన చెందాడు—

ఈ కథ చెప్పడంలో మీ ఉద్దేశ్యం మనిషి తన కుటుంబం వరకే పరిమితంకావాలని చెప్పడం అయితే మాత్రం దానితో నేనేకీభవించను- తన సంసారం చుట్టూ మాత్రమే గిరిగీసుకోకుండా సాధ్యమైనంతవరకు ఇతర్లకూ ఉపయోగపడటం మంచిది—అట్లని తన పరిస్థితి, స్థితిగతులను ఆలోచించకుండా ప్రవర్తించడమూ మంచిదికాదు .."

వామన్‌కు మౌనభంగం కాగానే శవంతోసహా మాయమై మళ్ళీ చెట్టెక్కాడు భేతాళుడు.

[చిత్రిక వారపత్రిక ఫిబ్రవరి, 1987]

—★—